తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## ముఖ్యమంత్రి సభ స్థల పరిశీలన



రేణిగుంట జూన్ 22 ప్రభాతవార్త

జూలై ఒకటో తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోసం ఏర్పాటు చేయ దలచిన సభా ప్రాంగణాలను సోమవారం అధికారులు పరిశీలించారు. రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీ కొత్తపాలెం గ్రామ వద్ద ఉన్న యోగానంద కాలేజీ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. ఉపాధి హామీ పథకం (ఎన్జీ ఎన్ఆర్ ఈజీఎస్) పేరును వికసిత భారత్ గ్యారెంటీకా రోజ్గార్ ఆజీవిక మిషన్ గ్రామీణగా మారుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సభను ఏర్పాటు చేయనున్నారు. అధికారులు పకడ్బందీ ఏర్పాటలో భాగంగా సభ నిర్వహించబోతున్న స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థలాలను పరిశీలించిన వారిలో ఎన్జీ ఎన్ఆర్ఇజిఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్, ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, డిపిఓ సుశీల దేవి, ఎంపీడీవో రవిచంద్ర, తదితరులు ఉన్నారు..

## ఒకే కుటుంబంలో
# నలుగురు ఆత్మహత్య

**భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి ఆత్మహత్య చేసుకున్న భర్త**
**దహన సంస్కారాలకు సైతం చేయిచాచని ఆత్మాభిమానం**
**బంగారెడ్డిపల్లి గ్రామంలో విషాదం**



దామెదరం, నిర్మల ( ఫైల్‌పోటోలు)

చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. భార్యతో పాటు ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి ఇంట్లో వున్న ఫ్యానుకు ఉరి వేసుకుని భర్త ఆత్మహత్య చేసుకోవడంతో ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. భార్య తీవ్ర వ్యాధితో బాధపడుతుండటం, వున్న డబ్బులు భార్య వ్యాధికి చికిత్స చేయడానికి ఖర్చు పెట్టడం, భవిష్యత్తులో భార్య జబ్బు నయం చేయడానికి మరింత డబ్బులు అవసరం కావడం, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులకు డబ్బులు చాలకపోవడం వంటి ఆర్థిక కారణలతో భూలోకం నుండి శాశ్వతంగా వెళ్ళిపోవాలని ఒక నిర్ణయానికి వచ్చిన భర్త భార్యతో పాటు ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి వారితో తాపించి ఆపై తాను ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన ఈ విషాధకరమైన సంఘటనకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లి గ్రామంకు చెందిన దామోదర్(30), అతని భార్య నిర్మల(23), 8వ తరగతి చదువుత్ను కుమారుడు దిలీప్(13), 6వ తరగతి చదువుతున్న కుమార్తె శ్రీవిద్య(10)లు ఆదివారం అర్ధరాత్రి వారి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తి కల్గిన తండ్రి దామోదర్ తనతో పాటు భార్య, పిల్లలను సైతం పరలోకంకు తీసుకెళ్ళాలని ఒక నిర్ణయానికి వచ్చి పక్కా ప్లాన్‌తో ఆదివారం రాత్రి భోజనం అయిన అనంతరం భార్య నిర్మల, పిల్లలు దిలీప్, శ్రీవిద్యలకు విషం ఇచ్చి తాపించాడు. ఆపై తాను ఫ్యానుకు తాడు కట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పలమనేరు మండలం మాడిపేట కోటూరు గ్రామంకు చెందిన దామోదర్, నిర్మల దంపతులు పదేళ్ళ క్రితం బంగారెడ్డిపల్లి గ్రామంకు వచ్చి స్థిరపడ్డారు. ఈ క్రమంలో గత కొంతకాలంగా భార్య నిర్మల బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతుండేది. భార్య నిర్మలకు వైద్యం చేయించడానికి దామోదర్ తన వద్ద వున్న డబ్బు మొత్తం ఖర్చు చేశాడు. రాణిపేట సిఎంసి ఆసుపత్రిలో నిర్మలకు వైద్యం చేస్తున్నప్పటికీ ఆమె ఆరోగ్యం మెరుగుపడకపోవడం, వైద్యం కోసం మరింత ఖర్చు చేయాల్సి రావడం, తన వద్ద అంత మొత్తంలో డబ్బులు లేకపోవడం, పిల్లల చదువు, ఇతర ఇంటి ఖర్చులకు సైతం డబ్బులకు ఇబ్బంది రావడంతో దామోదర్ తాను ఆత్మహత్య చేసుకోవడంతో పాటు తనతో పాటు తన కుటుంబసభ్యులు అందరినీ పరలోకాలకు తీసుకెళ్ళాలని నిర్ణయించి ఈ మేరకు పక్కా ప్లాన్ చేసి అమలు చేశాడు. ఇంట్లో వున్న వారందరు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలియని దామోదర్ సోదరి సోమవారం తెల్లవారుజాము ఇంట్లో వున్న దామోదర్ కుటుంసభ్యులను లేపడానికి వెళ్ళి తలుపు తట్టడం, కిటికీ నుండి చూస్తే దామోదర్ శరీరం ఫ్యానుకు వ్రేలాడుతుండటంతో భయపడిన ఆయన సోదరి కేకలు వేసింది. స్థానికులు ఇంట్లోకి వెళ్ళి చూస్తే భార్య, పిల్లలు విషం సేవించి మృతి చెంది పడివుండటం, ఫ్యానుకు ఉరి వేసుకుని దామోదర్ వేలాడుతుండటంతో సమాచారంను ఎన్ఆర్ పేట పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని మృతదేహాలన్నింటినీ పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుప్రతికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మృత్యువులో సైతం వదలిపెట్టని ఆత్మాభిమానం
**- తన డబ్బులతోనే దహన సంస్కారాలు చేయాలని లేఖ రాసిన దామోదర్**

ఆత్మహత్య చేసుకుని మృత్యుఒడిలో చేరినప్పటికీ దామోదర్ తన ఆత్మాభిమానంను వదులుకోలేదు. భార్య నిర్మల, పిల్లలు దిలీప్, శ్రీవిద్యలకు విషం ఇచ్చిన అనంతరం తాను ఫ్యానుకు ఉరి వేసుకోకముందు ఒక పేపర్ పెన్ను తీసుకుని అందులో తమ మృతదేహాలకు తమ డబ్బులతోనే దహన సంస్కరాలు నిర్వహించాలని, ఇందుకోసం ఇతరుల డబ్బులు ఖర్చు చేయవద్దని లేఖ రాసి ఇంట్లో వున్న టివికి అతికింది తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కాగితంలో దామోదర్ తన ఫోన్ పేకి సంబంధించిన పిన్ నెంబర్‌ను రాసి తన బ్యాంకు ఖాతాలో వున్న డబ్బులను ఫోన్‌పే ద్వారా డ్రా చేసి తన కుటుంబసభ్యుల దహన సంస్కరాలను చేయాలని కోరాడు. ఇదంతా చూసిన స్థానికులు కన్నీటి పర్యంతం అయ్యారు.

# అక్కడ డాక్యుమెంట్ రైటరే కింగ్!




**నకిలీ స్టాంపులు, సంతకాలతో రిజిస్ట్రేషన్లు - కార్వేటినగరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయనదే అడ్డా రాజ్యం**

చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాలో రిజిస్ట్రార్ కార్యాలయాలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్‌లే కింగ్‌లుగా మారి వాళ్ళు చెప్పిందే వేదం...చేసిందే చట్టంగా చలామణి అవుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు, నియమాలు ప్రకారం ప్రజలకు అవసరమైన స్టాంప్ కాగితాలు,బాండు పేపర్లను విక్రయిం చాల్సి ఉన్నా అందిన కాడికి దోచుకుని పాత తేదీలతో కూడా స్టాంప్ కాగితాలు విక్రయిస్తుండటం డాక్యుమెంట్ రైటర్‌లు సులువుగా నేర్చుకున్న సంపాదన. సరిగ్గా ఇలాంటి నకిలీ స్టాంప్ బాగోతం ఒకటి చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలకేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వెలుగుచూసింది. అక్కడ పనిచేసే ఓ డాక్యుమెంట్ రైటర్ కీలకంగా వ్యవహరించి ఇష్టారాజ్యంగా వ్యవహరించాడనేది ఇప్పుడు సంచలనంగా మారింది. ఆస్తులు కలిగి ఉన్న భూ యజమానులకు అన్యాయం చేసేలా అనర్హులకు అందలం కట్టబెట్టి నకిలీ రిజిస్ట్రేషన్లకు వత్తాసు పలుకుతూ ఏకంగా అక్రమాలకు తెరతీశాడనేది గుప్పుమంది. నకిలీ స్టాంపులు, సంతకాలతో ఉండే డాక్యుమెంట్లతో వెళ్ళిన వారికి రిజిస్ట్రేషన్ కార్యాల యంలో బాధ్యులైన అధికారులు ఎలాంటి తనిఖీలు చేయకుండానే పక్కాగా రిజిస్ట్రేషన్లు చేస్తుండటం ఈ వివాదానికి దారితీసింది. శ్రీరంగరాజపురం మండల పరిధిలోని ఓ ఆస్తిని నకిలీ డాక్యుమెంట్లతో కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మరొకరికి రిజిస్ట్రేషన్ చేయిం చారని గుర్తించిన అసలైన యజమాని ఎస్ఆర్‌పురం పోలీసులు, కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేయడం వెలుగుచూసింది. అయితే బాధితుడి ఫిర్యాదుపై స్పందించి న్యాయం చేయకపోవడంతో నేరుగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ జరుగుతున్న నకిలీ ఆస్తుల రిజిస్ట్రేషన్ల వ్యవ హారం బహిర్గతమైంది. ఎస్ఆర్ పురం తహసిల్దారు, రిజిస్ట్రేషన్ పత్రాల్లో వున్న తహసిల్దారు, విఆర్ఓల సంతకాలు, సీళ్ళు నకిలీవని స్పష్టం చేయడంతో దీనిపై ఎస్ఐ సుమంత్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకిలీ భూముల రిజిస్ట్రేషన్ దందా జోరుగా జరుగుతుందని నిర్ధారణకు వచ్చారు. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో డాక్యుమెంట్ రైటర్‌గా విధులు నిర్వహించే ఓ వ్యక్తి కుమారుడు లవకుమార్ నకిలీ పత్రాలు తయారు చేసేవాడని, ఆపై ఆ పత్రాలపై శ్రీరంగరాజపురం మండలం వడ్డిపల్లి గ్రామంకు చెందిన యోగానంద్ అనే వ్యక్తి నకిలీ స్టాంపులు, సంతకాలు చేసే వాడని తేలింది. ఈ పత్రాలను దర్జాగా కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంకు తీసుకెళ్ళి, ఆ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు మామూళ్ళు ఎరగా చూపి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పక్కాగా ముగించేవారని తెలిసింది. కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకిలీ రిజిస్ట్రేషన్లపై వచ్చిన ఫిర్యాదుపై విచారించిన ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుమన్ నిందితుల నుండి శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాలకు సంబంధించి తహసిల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి 18 స్టాంపులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలో డాక్యుమెంట్ రైటర్ కుమారుడి నుండి పెద్ద ఎత్తున నకిలీ స్టాంపులు, సంతకాలు వున్న పత్రాలు బహిర్గతం కావడటంతో ఇటీవల కాలంలో కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏ మేరకు నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగాయనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలో ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్లను పూర్తి స్థాయిలో పరిశీలించి నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగి వుంటే వాటిని రద్దు చేయాల్సిన అసవరం ఎంతైనా వుందని పలువురు అసలైన యజమానులు కోరుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఎస్ఆర్‌పురం పోలీసుల విచారణతో వెలుగు చూసిన నకిలీ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి ఆ ఆస్తిని నిజమైన వారసుడికి మార్చాల్సిన అవసరం వుంది.

**-నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం ఎలా బహిర్గతం అయ్యిందంటే...**

ఎస్ఆర్‌పురం మండలం శ్రీరామరాజపురం గ్రామంకు చెందిన మహేష్ తన తాత ఇంటి స్థలంను కొనుగోలు చేశాడు. అయితే ఆదే గ్రామంకు చెందిన మరొక వ్యక్తి ఆ స్థలం కొనుగోలు చేసినట్లు తహసిల్దారు సం తకంను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించి కార్వేటినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంకు తీసుకెళ్ళడంతో కార్యాలయ అధికారులు ఎలాంటి క్రాస్ చెక్ చేయకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేశారు. తన ఆస్తిని ఇతరులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై మహేష్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై తనకు జరిగిన అన్యాయంను కలెక్టర్‌కు వివరించారు. ఈ వ్యవహారంను పరిశీలించి న్యాయం చేయాల్సిందిగా కలెక్టర్ ఎస్ఆర్ పురం తహసిల్దారు లోకనాథపిళ్ళైను ఆదేశించారు. తహసిల్దారు ఈ వ్యవహారంపై విచారణ నిర్వహించగా తన కార్యాలయం స్టాంపుతో పాటు, తన సంతకం, విఆర్ఓ సంతకంను సైతం ఫోర్జరీ చేసి వున్నట్లు గుర్తించి ఎస్ఆర్ పురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సుమంత్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ నిర్వహించిన పోలీసులు నిందితులను గుర్తించి వారి నుండి 18 స్టాంపులు, పత్రాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### రికార్డుల ఆధారంగానే రిజిస్ట్రేషన్లు : సబ్‌రిజిస్టార్ సత్యప్రసాద్

కార్వేటినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రికార్డుల ఆధారంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తున్నట్లు సబ్ రిజిస్ట్రార్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా వుండటంతో ఏజెంట్లు రైతులు, ఇతర ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చే వారికి సహాయ సహకారాలు అందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారని, నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగి వుంటే ఆ విషయంను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## నిర్ధేశిత కాలంలో సమస్యలకు పరిష్కార మార్గం
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ధేశిత కాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ, సర్వే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ అంశాలపై ప్రజల నుండి ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తున్నాయన్నారు. అలాగే అధికారులు పిజిఆర్ఎస్ పోర్టల్‌పు నిరంతరం పరిశీలిస్తూ పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా అందుతున్న ఫిర్యాదులను అత్యంత బాధ్యతతో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, డిఆర్ఓ మోహన్‌కుమార్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ పుల్లయ్య, డిపిఎం మధుసూధన్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, కుప్పం అర్డీఓ విజయలక్ష్మీలు పాల్గొని ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంకు జిల్లా అధికారులు హాజరయ్యారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి సమస్యలపై 238 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి భూ, సర్వే సమస్యలకు సంబంధించి 189 అర్జీలు అందగా, డిఆర్‌డిఎ 16, పోలీసు శాఖ 5, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 5, డ్వామా 2, ఎపిఎస్‌పిడిసిఎల్ 2, సివిల్ సప్లైస్ 2, ఎపిఎస్ఆర్టీసీ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, డిఎంహెచ్ఓ, మత్స్యశాఖ, జిల్లా విద్యాశాఖ, భూగర్భ గనుల శాఖ, సైనిక్ వెల్ఫేర్, హౌసింగ్, అటవీశాఖ ఒకొక్క అర్జీ అందాయి.

## రైతులు ఎల్‌నినోను తట్టుకునే ఉపాయాలు
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:

ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం తట్టుకునే ఉపాయాలను రైతులకు తెలియజేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న! మీకోసం అనే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ కొద్దిరోజుల క్రితం ఎల్‌నినోను అధికారికంగా ప్రకటించిందన్నారు. దీని ప్రభావంతో వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం వుంటుందన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కారక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ పుల్లయ్య, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, కుప్పం అర్డీఓ విజయలక్ష్మి, డిపిఎం మధుసూధన్, జిల్లా వ్యవసాయ అదధికారి మురళీ తదితరులు పాల్గొన్నారు.

## నమో గోవిందరాజాయనమః
**-పుష్పార్చనలతో పులకించినస్వామి**



తిరుపతి, జూన్ 22ప్రభాతవార్త:

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లగా, భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల వరకు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వేదోక్తంగా నిర్వహించారు.ఆలయ డిప్యూటీ ఈఓ వి.ఆర్. శాంతి, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులు, ఏఈఓ ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్స్పెక్టర్ రంజిత్, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

## పోలీసులు అనుమానితులకు
# గంజాయి నిర్ధారణ పరీక్షలు
**- గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం**

*నాయుడుపేట, జూన్ 22 ప్రభాతవార్త:*

*తిరుపతి జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం సరికొత్త పంథాలో తనిఖీలు మొదలుపెట్టింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సంయుక్త ఆదేశాల మేరకు నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు శరవేగంగా తనిఖీలు చేపట్టారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు నేరుగా పర్యవేక్షణలో, అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఈరోజు పట్టణంలోని ఏఎల్సీఎం మైదానంలో భారీ తనిఖీలు నిర్వహించారు. మైదానంలో మరియు పరిసర ప్రాంతాలలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పలువురు యువకులను, వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.*

***- అక్కడికక్కడే గంజాయి పరీక్షలు:***

*గతానికి భిన్నంగా ఈసారి పోలీసులు అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్లతో మైదానంలోనే అనుమానిత వ్యక్తులకు నేరుగా గంజాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించారా లేదా అనేది ఈ పరీక్షల ద్వారా తక్షణమే తేలిపోతుంది.*

***- యువత భవిష్యత్తు నాశనం కావొద్దు పోలీసులు:***

*ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ పట్టణంలో గంజాయి సంస్కృతిని పూర్తిగా అణచివేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా లేదా సేవించినా వారిపై కఠినమైన నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. పోలీసుల ఈ మెరుపు దాడులు, అత్యాధునిక పరీక్షల నిర్వహణతో నాయుడుపేటలోని మత్తు ముఠాల్లో వణుకు మొదలైంది.*

# బస్సును ఢీకొన్న లారీ
**ఇద్దరు మృతి**
**16 మందికి తీవ్రగాయాలు**







పుల్లంపేట, జూన్ 22 ప్రభాతవార్త :

కడప చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే తిరుపతి నుంచి కడపకు వెళుతున్న సూపర్ లగ్జరీ బస్సును కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడ్ తో చెన్నై కి వెళ్తున్న లారీ పుల్లంపేట హెచ్.పీ గ్యాస్ గోడౌన్ దగ్గర సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న సూపర్ లగ్జరీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అందులో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన వారిని రైల్వే కోడూరు రూరల్ సీఐ డి.శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌తో పాటు పోలీస్ వాహనంలలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొందరిని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే రాజంపేటకు చెందిన పునీత్ సాయి అనే సంవత్సరం వయసు గల బాలుడు అక్కడికక్కడే మృతిచెందగా, యశస్విత (16) కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఓవర్ స్పీడ్ తో సూపర్ లగ్జరీ బస్సును డ్రైవర్ భాగాన చివర వరకు గుద్దుకొని పోవడంతో బస్సులోని ఒకరికి చెయ్యి తెగి పడిపోయింది. మరొకరి కాలు తెగిపడి రోడ్డుపై పడిపోవడంతో నెత్తురోడిన రోడ్డు బాధిత రోదనలో మిన్నలుంటాయి. సంఘటన జరిగిన వెంటనే సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాసులు తమ సిబ్బందితో యాక్సిడెంట్ జరిగిన ప్రదేశానికి చేరుకుని క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కౌన్సెలింగ్ చిరునవ్వు...చిన్నబోయింది
**-కౌన్సెలింగ్ విద్యార్థి తుది శ్వాస విడిచింది-మరో విద్యార్థినికి రెండు వేళ్ళు తెగిపోయాయి**



శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త

సోమవారం ఉదయం కడపజిల్లా విడుపుల పాయలో ట్రిపుల్ ఐఐటి కౌన్సెలింగ్. ఎన్నో ఆశలు, భవిష్యత్తుపై ఊహలు. ఒంగోలు తీసుకుంటే రెండేళ్ళు ఇడుపుల పాయలో ఉండాలి. కాబట్టి నూజివీడులో తీసుకుందామని శ్రీకాళహస్తిలోని పిట్టల వారి సందుకు చెందిన దినకర్ కుమార్తె యశ్విత(19) పదవ తరగతి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదివింది. మంచి మార్కులతో పాటు త్రిబుల్ ఐఐటిలో అవకాశం వచ్చింది. పది రోజులుగా ఎన్నో కలలు, ఉహాలు, ఊహాగానాలతో తండ్రి దినకర్,తల్లి,అక్కలతో కలసి ఆదివారం రాత్రి ఇడుపుల పాయకు బయలు దేరారు. .సోమవారం వేకువ జామును పుల్లం పేట సమీపంలో ఎదరుగా వస్తున్న లారి అదుపుత ప్పి బస్సునఢీకొంది. ఈప్రమాదంలో డ్రైవర్ వైపు కూర్చొన్న యశ్విత కుటుంబం విషాదంలో మునిగిపోయారు. అసంకల్పింతంగా జరిగిన ఈ సంఘటనలో యశ్విత తీవ్రంగా గాయపడింది. తల్లికి తండ్రికి గాయాలు అక్కకు రెండు కాళ్ళు విరిగాయి. సోమవారం తెల్లవారుతుండగా వాడలో విషాద వార్త అలుముకుంది. దినకర్ కుటుంబం కష్టాల్లో మునిగిపోయిందని, అందరితో కలగొలుపుగా గడిపే యశ్విత ఇక లేదన్న వార్తను ఆ ప్రాంత వాసులు జీర్ణించుకోలేక పోయారు.

### వరదయ్యపాళెంలో విషాదం:



సత్యవేడు మండలం మాధనపాలెంకు చెందిన ఆర్ తేజస్విని పదో తరగతిలో 573 మార్కులతో ఉత్తీర్ణురాలైంది. పేదకుటుంబంలో మెరిసిన విద్యా కుసుమం తేజస్విని పట్టుదలతో ఇడుపుల పాయలో సీటు సాధించింది. సోమవారం జరిగే కౌన్సెలింగ్‌కు బయలు దేరింది. శ్రీకాళహస్తి నుంచి వెళుతున్న దినకర్ కుటుంబంతో పాటు వీరు అదేబస్సులో పయనం ప్రారంభించారు. పుల్లం పేట వద్ద జరిగిన బస్సును లారీ డీకొన్న సంఘటనలో తేజస్వినికి రెండు చేతి వేళ్ళు తెగిపోగా కాలికి తీవ్ర గాయంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చేరింది.

## సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా




రైల్వేకోడూరు అర్బన్, జూన్ 22, ప్రభాతవార్త.

తిరుపతిజిల్లా రైల్వే కోడూరు మండలం స్థానిక సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ వెలుగు యాని మేటర్ల ఉద్యోగుల సంఘం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జాన్ ప్రసాద్, వివో ఏ అధ్యక్షులు గంగాదేవి, కార్యదర్శి సోనీ, కోశాధికారి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు:

పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలి., నెలనెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలి., అదనపు యాప్‌ల ఒత్తిడి నుండి విముక్తి కల్పించాలి., కనీస వేతనం ..26,000 చెల్లించాలి. సున్నా వడ్డీ కింద ..10 లక్షల రుణం మంజూరు చేయాలి.,గ్రాడ్యుయేటీని అమలు చేయాలి., హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి.ఈ కార్యక్రమంలో మండల, ఉపాధ్యక్షులు సునీత, మునికాంతమ్మ, సహాయ కార్యదర్శులు రేవతి, సుభాషిని, మండల వివో ఏ సభ్యులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలపొదుపు సొమ్ము స్వాహా ..

శాంతిపురం, జూన్ 22 ప్రభాతవార్త

శాంతిపురం మండలం కొలమడుగు గ్రామంలో మహిళా పొదుపు సంఘంలో డబ్బులు కాజేసింది ఎవరని ఆ గ్రూపు సంఘ సభ్యులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సంఘటన కు సంబంధించి వివరాలు ఇలా .. గ్రామంలోని శ్రీ కనకదాస పొదుపు సంఘం వారు ఆ సంఘంలోనే ఉండే మహిళలకు చెందిన బంధువులు ద్వారా లోన్ అకౌంట్ కి 24112025 రోజు 50400 డిపాజిట్ చేయమని ఇస్తే వారు బ్యాంకులో కేవలం 5400 డిపాజిట్ చేసి మిగిలిన డబ్బులు వారు తీసుకుని బ్యాంకు వారు ఇచ్చిన రసీదులో మరో సున్నా యాడ్ చేసి గ్రూపు సభ్యులకు రసీదు అందించినట్లు తెలిసింది. అలాగే ఎస్బి అకౌంట్ కు 10 400 డిపాజిట్ చేయమంటే 1400 డిపాజిట్ చేసిన బ్యాంకు వారు ఇచ్చిన రసీదుకు మరో సున్నా యాడ్ చేయడం జరిగింది. ఈ విషయంపై సభ్యులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.సుమారు 54 వేల రూపాయలు అవినీతి జరిగింది. ఈ విషయంపై ఏపీఎం శ్రీనివాసులు ను ప్రభాతవార్త వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## యోగా గురువుకు ఆర్యవైశ్య సంఘం చిరు సన్మానం



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు స్థానిక పాత బజార్లోని వాసవి మండపం నందు యోగా లో శిక్షణా తరగతులు ఇచ్చినటువంటి కామిశెట్టి చంద్రశేఖర్ , కామిశెట్టి లక్ష్మీ నారాయణ కుమారులు వీరిది మన రైల్వే కోడూరు స్వగ్రామ్. మీరు వృత్తి రీత్యా తెలంగాణ రక్షణ శాఖలో ఉంటారు. వారి చేసే వృత్తి చాలా కఠినమైనది, కానీ సున్నిత మనస్కులై వృత్తికి సంబంధం లేకుండా ప్రవృత్తి సామాజిక సేవయందు నిరంతరం అభిలాష కలిగి ఉంటారు. మన ఆర్యవైశ్య సంఘం పిలుపు అందిన వెంటన అమూల్యమైన సమయాన్ని వెచ్చించి మన పట్టణానికి విచ్చేసి మన ఆర్యవైశ్యులందరూ ఆరోగ్యంగా ఉండాలని సలహాలు సూచనలు అందించినటువంటి ఆయనకి మనసారా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ. ఏ వృత్తిలో ఉన్న ప్రవృత్తి మాత్రం పరమశాంతంగా ఉండాలని ఆచరించి చూపిస్తున్న వారికి ధన్యవాదాలు.

## మద్యం తాగుతే కఠిన చర్యలు తప్పవు: ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తులసి



రైల్వేకోడూరు అర్బన్, జూన్ 22, ప్రభాతవార్త.

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యము సేవించడం నేరము అని, కఠిన చర్యలు తీసుకుంటాము అని కోడూరు ప్రొహిబిషన్గా ఎక్సైజ్ ఇనస్పెక్టర్ తులసి అన్నారు. కోడూరు పట్టణ పరిధిలో గత నాలుగు రోజులు నుండి బహిరంగ ప్రదేశములలో దాడులు నిర్వహించి బహిరంగ ప్రదేశంలో మద్యము సేవిస్తున్న ఆరుగురు (6) వ్యక్తులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడమైనది ఇనస్పెక్టర్ మాట్లాడుతూ మద్యము దుకాణములలో అనువత్నిచిన పర్మిట్ రూం లలో మాత్రమే మద్యము సేవించేందుకు అనుమతి వున్నది అన్నారు. బహిరంగ ప్రదేశములలో మద్యము సేవిస్తే చట్ట ప్రకారము చర్యలు, కేసులు నమోదు చేస్తాము అనీ, శిక్షలు అమలు అవుతాయని తెలియజేయుచున్నాను.

## పిల్లలకు ప్రారంభ విద్య ఎంతో అవసరం



రామచంద్రాపురం, జూన్ 17 ప్రభాతవార్త:

పిల్లలకు ప్రారంభ విద్య ఎంతో అవసరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ రేవతి అన్నారు. సోమవారం కుప్పం బాదూరు అంగన్వాడీ కేంద్రంలో స్కూల్ రెడ్డినెస్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను పాఠశాల విద్యకు సన్నద్ధం చేయడం వారి శారీరక మానసిక భాష, సామాజిక ద్వేగాలు అభివృద్ధి చేయడమే లక్ష్మన్నారు. ఆటలో పాటలు కథలు ద్వారా పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీయడం కోసం అంగన్వాడిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి చిన్నారి ఆనందంగా ఆత్మవిశ్వాసంతో పాఠశాల జీవితంలోకి అడుగుపెట్టేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్ కృష్ణ అంగన్వాడి కార్యకర్తలు బి మాలతి ఎన్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుడిపాల, జూన్ 22 ప్రభాతవార్త:



గుడిపాల మండల పరిధిలో రోడ్డు ప్రమా దంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమ వారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామ్మోహన్ వివరాల మేరకు చిత్తూరు- వేలూరు జాతీయ రహదారి వసంతా పురం వద్ద చిత్తూరు నుండి వేలూరు వైపుకు వెళ్తున్న ట్రిప్పర్ లారీని వెనుక వస్తున్న షిఫ్ట్ కారు డ్రైవర్ నిద్ర మత్తుతో వెనుక నుండి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో కారు డ్రైవర్ బాలసుబ్రమణ్యం(55)ను చికిత్స నిమిత్తం చీలాపల్లి సిఎంసి ఆసుపత్రికి తరలించగా అతను చికిత్స పొందుతూ మృతి చెందగా ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలురుగు మహిళలు, ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ రామ్మోహన్ దర్యాప్తు చేస్తున్నారు.

## హెల్మెట్ రహిత గ్రామంగా పూనేపల్లి ప్రకటింపు

పెనుమూరు, జూన్ 22 ప్రభాతవార్త:



హెల్మెట్ రహిత గ్రామంగా పెనుమూరు మండలం పూనేపల్లి గ్రామంను వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచంద్ర, పెను మూరు ఎస్ఐ శ్రీనివాసులులు ఆదివారం ప్రకటించారు. దాతల సహాయంతో 50 మంది ద్విచక్రవాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచంద్ర, పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు పంపిణీ చేశారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించి వారితో ఇన్స్పెక్టర్ రామచంద్ర ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో గ్రామస్తులు స్వచ్ఛంధంగా నో హెల్మెట్-నో ఎంట్రీ-నో ఎగ్జిట్ బోర్డులను స్వచ్ఛంధంగా ఏర్పాటు చేసి రోడ్డు భద్రత పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చునని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలకు పక్కాగా పాటించాలని ఇన్స్పెక్టర్ రామచంద్ర కోరారు.

## పాకాలలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

నూతన తహసిల్దార్ కిరణ్ కుమార్

పాకాల, జూన్ 22, ప్రభాతవార్త



పాకాల మండల ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని నూతన తహసిల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగం (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. పాకాల తహసిల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనంతరం కిరణ్ కుమార్ నిర్వహించిన తొలి గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం కావడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మొత్తం 11 వినతులు అందగా, వాటిని తహసిల్దార్ స్వయంగా పరిశీలించి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రీవెన్స్ సెల్‌లో రేషన్ కార్డులు, ఆధార్ సీడింగ్ సమస్యలు, ఇళ్ల స్థలాలు మరియు కొత్త ఇంటి పట్టాల మంజూరు, భూ వివాదాలు, ప్రభుత్వ ఆర్థిక సహాయం, రుణాల మంజూరు, రెవెన్యూ రికార్డుల సవరణలు, వన్‌బీ, అడంగల్ మార్పులు తదితర అంశాలకు సంబంధించిన వినతులు అందాయి. అందిన అర్జీలను పరిశీలించిన తహసిల్దార్ కిరణ్ కుమార్, తక్షణ పరిష్కారం సాధ్యమైన కొన్ని ఆధార్ సీడింగ్ మరియు రెవెన్యూ సమస్యలను అధికారులతో సమన్వయం చేసి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి అర్జీదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, వి.ఆర్.ఓలు, ఇతర అధికారులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 33 వినతులు

..డిప్యూటీ కమిషనర్ అమరయ్య...



తిరుపతి కార్పొరేషన్, జూన్ 22, ప్రభాతవార్త

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 23మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. సంజీవయ్య నగర్ లో తన స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారు పరిశీలించాలని, చంద్రశేఖర్ కాలనిలో సెల్ టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలని, మునిసిపల్ కూరగాయల మార్కెట్ వద్ద అనదికారిక వసూళ్లు అరికట్టాలని, భవానీ నగర్ నందు దుర్వాసన వస్తున్న డ్రైనేజి కాలువ శుభ్రం చేయాలని, బైరాగి పట్టేడ ఆర్చి వద్ద పౌల్ట్రీ వలన ఇబ్బందులు ఉన్నాయి పరిశీలించాలని, భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని, సప్తగిరి నగర్, సుందరయ్య నగర్ నందు వాటర్ ప్లాంట్లు ఎక్కువగా ఉండడం వలన ఇబ్బందిగా ఉందని, లక్ష్మీపురం స్మశాన వాటిక లో సెక్యూరిటీ గార్డ్ నియమించాలని, ఈట్ స్ట్రీట్ నందు మరుగుదొడ్లకు మోటారు ఏర్పాటు చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, ఎస్. వి నగర్ నందు డెంటల్ హాస్పిటల్ రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్నారు పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నయం చేయవచ్చు




రేణిగుంట జూన్ 22 ప్రభాతవార్త :

ప్రారంభ దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే చికిత్స చేసి నయం చేయవచ్చని టాటా ట్రస్ట్ మేనేజర్ హేమంత్ అన్నారు. రేణిగుంట మండలం మా పంచాయతీ నందు సోమవారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మధుమేహం, రక్తపోటు, రొమ్ము నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా టాటా ట్రస్ట్ మేనేజర్ హేమంత్ మాట్లాడుతూ రాస్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ప్రజలు క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స చేసి నయం చేయవస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ లను అదుపులో ఉంచుకోవాలన్నారు. వ్యాధులు సంక్రమించి బాధలు పడటం కంటే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ సిబ్బంది డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డి కుమారి, మెహతా, రాజ్ ప్రాజెక్టు ఆఫీసర్ రవి, రామానుజులు, స్వాతి, నాగమణి, ఉష, శంకరయ్య, రాస్ బాలాజీ బాలవికాస్ సిబ్బంది సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు

## కలలకు రెక్కలు కార్యక్రమం నిజమైంది

కేవీబీ పురం, జూన్ 22 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలలకు రెక్కలు అనే కార్యక్రమంలో 2026 సంవత్సరంలో పదో తరగతిలో మొదటి ద్వితీయ, తృతీయ స్థానాలల్లో నిలిచిన ఎస్.దీక్షిత, ఎంపేలినలిథియాల్, ఇ.వెంకటలక్ష్మి అనే ముగ్గురు పిల్లలకు కేవీబీ పురం నుంచి ఢిల్లీ వరకు విమాన ప్రయాణానికి అనే కలలకు రెక్కలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ ఓబయ్య మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన పలు సూచనలు అందించారు. విద్యార్థులు ఎలాంటి నేర ప్రవృత్తి లేకుండా విద్యాభ్యాసం కొనసాగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమానికి దాతగా కరపారెడ్డి కందస్వామి వ్యవహరించారు. ఇదే సమయంలో పాఠశాలలో మొదటి ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు కరపారెడ్డి, సుబ్బారెడ్డి పేరు మీదుగావారి మనవడు కరపారెడ్డి రామకృష్ణారెడ్డి అవార్డులను ప్రకటించారు. వారికి నగదు ప్రోత్సాహం, మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ విద్య అభివృద్ధికి పాఠశాల స్థాయిని పదోన్నతి కల్పిస్తున్నట్టు పాఠశాల గ్రేట్ విద్యాప్రదంగా చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన వెల్లడించారు. అనంతరం దాత కందస్వామి మాట్లాడుతూ 550 కంటే మార్కులు ఎక్కువగా సాధించిన విద్యార్థులను విమాన ప్రయాణానికి అయ్యే ఖర్చులు కర్పాటి వారి కుటుంబం భరిస్తుందని ప్రకటించారు. మండల ప్రాథమిక వైద్యాధికారి బి.ఎల్.నాయక్, నాయకులు కూడా విద్యార్థులకు పదివేలు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

పులిచెర్ల, జూన్ 22 ప్రభాతవార్త



ఈ నెల 28వ తేదీ ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో సమిష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని పులిచెర్ల తహసీల్దార్ జయసింహ పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమం పై మండల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లంకివారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ యల్లయ్య మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం ద్వార పోలియో రహిత సమాజం ఏర్పడి చిన్నారులు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడపడతారన్నారు. మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 3377 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్యసాధనకై మొత్తం మూడు రూట్లలో 21 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, అంతేకాకుండా మూడు మొబైల్ టీమ్స్ ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. తల్లిదండ్రులు ఆదివారం పోలియో కేంద్రాలకు వచ్చి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ జయసింహ, యల్లంకి వారి పల్లె వైద్యాధికారి యల్లయ్య, పులిచెర్ల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ యంపిడివో హరికిరణ్, మండల విద్యాశాఖాధికారి 2 పోకల తాతయ్య, ఆరోగ్య విస్తరణాధికారులు కృష్ణయ్య, రామచంద్ర, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుహసిని, హెల్త్ సూపర్ వైజర్ పురుషోత్తం పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శివశక్తి ఆశ్రమం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ

నారాయణవనం, జూన్ 21 ప్రభాతవార్త :



శివశక్తి ఆశ్రమం నిర్వాహకులు శ్రీ దేవినాథ్ గురు దంపతులు చెన్నై వారిచే సుమారు రూ. 7లక్షల 55వేల విలువ చేసే విద్యా సామాగ్రీలను సుమారు 1600 పేద విద్యార్థులకు ఉచితంగా అందించారు. నిర్వాహకులు దేవినాథ్ మిషన్ చెన్నై వారు మండలంలోని కైలాసకోనలో శివశక్తి ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుమారు రూ.7లక్షల 55వేల విలువ చేసే సామాగ్రీలను అందించడం జరిగింద న్నారు. 1నుంచి7 వరకు చదవే పిల్లలకు అందిస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు శ్రీ దేవినాథ్ మిషన్ వారితో పాటు ఎంఇఓ కోదండనాయుడు, టీచర్ దశరథన్, ఏలుమలై అందరు పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో తహాశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా

నారాయణవనం, జూన్ 22 ప్రభాతవార్త :




స్థానిక తహాశీల్దారు కార్యాలయం ఎదుట సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చిన్నిరాజ్, పుత్తూరు డివిజన్ ఎఐటియుసి కార్యదర్శి సిద్దంశెట్టి చంద్రబాబులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు కోసం పదేళ్లుగా ఉన్నత అధికారులకు ఆర్జీలు ఇస్తున్నప్పటికి ఫలితం లేదని మండిపడ్డారు. వినతిపత్రం అందించే సమయంలో మూడు లేదా నాలుగు నెలల్లో ఇస్తామని అధికారులు హామి ఇవ్వడం తప్ప ఆచరణ కావడం లేదన్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికుల కష్టాలను గుర్తించి ఇంటి స్థలాలతో పాటు ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అలాగే భవన నిర్మాణ సంక్షేమ భోర్డు కోసం వసూళ్ల సెస్ నిధులను దారి మళ్లించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పెండింగ్ క్లైమ్‌లను మూడు నెలల్లో పరిస్కరించాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్కిల్ కార్మికుడికి అన్ స్కిల్ కార్మికుడికి కనీస పని దినాలు, పనికి వేతనం చట్టబద్దం చేయాలని కోరారు. ధర్నా అనంతరం తహాశీల్దారు భార్గవికి వినతిపత్రం అందించగంతో సానుకూలంగా స్పందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాబు, వెంకటేష్, చిరంజీవి, దాము శరవణ, శ్రీ రామయ్య, శంకర్, శ్రీనివాసులు, పరందాం, కార్మికులు అందరు పాల్గొన్నారు.

## వైభవంగా పరాశరేశ్వరునికి కల్యాణోత్సవ వేడుకలు

నారాయణవనం, జూన్ 22 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 6.30గంటలకు స్వామి, అమ్మవారికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి 8.30గంటలకు స్వామి, అమ్మవారిని అశ్వవాహనంలో అధిరోహించి గ్రామవీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో శుద్ధి, నిత్య కైంకర్యపూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం, స్వామి, అమ్మవారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. ఊరేగింపులో భక్తులు అడుగడుగునా హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్పెక్టర్ భరత్, టిటిడి, విజిలెన్స్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ రంగంలో తీసుకువచ్చిన జీవోలను వెంటనే రద్దు చేయాలి

– ఏఐటీయూసీ



పుత్తూరు రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:

ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శాసనసభలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ పుత్తూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.మహేష్, పుత్తూరు అధ్యక్షుడు టి.విజయకుమార్‌లు హాజరై ఎమ్మెల్యేతో సమస్యలపై చర్చించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో 14 కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 975, 673 జీవోలను తక్షణమే ఉపసంహరించాలని, శాశ్వత స్వభావం కలిగిన విధులను నిర్వహిస్తున్న పర్మినెంట్ చేయాలని వివిధ మున్సిపాలిటీల్లో జరుగుతున్న లోపాలను, దుబారా ఖర్చులను, అవినీతిని నియంత్రించేందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని నియమించాలని, పౌర సేవలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి తప్ప ప్రైవేటీకరించరాదని వారు అన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.1 లక్ష చెల్లిస్తామని, పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని, మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదని, జీతాలు పెరగాల్సిన గడువు దాటిపోయి నాలుగేళ్లు కావస్తుందని వెంటనే జీతాలు పెంచాలని 12వపీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, మున్సిపల్ వాహనాలను వినియోగించకుండా ప్రైవేటు వాహనాలను వినియోగిస్తూ మున్సిపల్ కార్మికులకు పనిలేకుండా చేస్తున్నారని తదితర సమస్యలను వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి శాసనసభలో కృషి చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపును జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని నేడు జరిగే కలెక్టర్ కార్యాలయం వద్దకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున కదలి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ విజయకుమార్, కార్యదర్శి కుమార్, కోశాధికారి రామయ్య, ఉపాధ్యక్షులు ప్రభాకర్, దేవరాజులు, మణమ్మ, గోవిందస్వామి, నాయకులు శివ, సుబ్బమ్మ, రమా, వల్లి అమ్మ, మంగమ్మ, నవీన్, శివప్రసాద్, చలపతి పాల్గొన్నారు.

## ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం : అదనపు ఎంఈవో



సత్యవేడు, జూన్ 22 ప్రభాతవార్త:

చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఫోక్సో చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు స్థానిక విద్యాశాఖ అధికారి ఉష పేర్కొన్నారు. సోమవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో ఫోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంఈవో-2 మాట్లాడుతూ వయసు 18 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులపై చోటు చేసుకుంటున్న లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం 2012లో కేంద్ర ప్రభుత్వం ఫోక్సో చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. తద్వారా శారీరక వేధింపులు, అసహజ లైంగిక దాడి, లైంగికంగా తాకడం వంటి నేరాలను ఈ చట్టంలో తీవ్రమైనవిగా పరిగణిస్తారని ఆమె వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ నేరం తీవ్రతను బట్టి కనీసం 3 సంవత్సరాల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష పడే అవకాశం ఉన్నట్టు వివరించారు. తీవ్రమైన నేరాలకు మరణశిక్ష విధించే అవకాశం కూడాలేకపోలేదన్నారు. ఎఫ్ఐఆర్‌నమోదైన 24 గంటల లోపు బాధితురాలకు వైద్య పరీక్షలు నిర్వహించడం ఫోక్సో చట్టం ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి, వాణి, డిల్లీ రాణి, అంగన్‌వాడీ టీచర్స్ అనురాధ, భారతి, పలువురు బాలికలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఇంటింటా సర్వే



విజయపురం, జూన్ 22 ప్రభాతవార్త:

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో బీఎల్‌వోలతో పాటు బీఎల్‌ఏలు ఇంటింటా సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండల కేంద్రమైన విజయపురంలో ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి చుక్క ధనంజయయాదవ్ బీఎల్‌వో, బీఎల్‌ఏలతో కలసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి 2002 ఓటర్ల జాబితాలో పేర్లు కలిగిన పౌరాలను అర్హులైన వారికి అందించి వాటిలో ఏ విధంగాసమాచారాన్ని పూరించాలని వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరు ఇందులో పాల్గొని తమ పేర్లను ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు.

# కాపులకు వెన్నుపోటు పొడిచింది వైసిపినే: ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త

**పులివెందుల దాటి పోటీ చేసే ధైర్యం జగన్‌కు ఉందా?**

**వైసిపి అరాచకాలను ఆ పార్టీ కాపు నేతలే ప్రశ్నించాలి**

**సామాన్య కార్యకర్తలను గౌరవించిన చరిత్ర జనసేనదే**

**ఐదేళ్ల వైసిపి పాలనలో కాపు కార్పొరేషన్ నిర్వీర్యం**

దేశం, సమాజం బాగుండాలని కోరుకునే పవన్ కళ్యాణ్‌కు కులం రంగు పూసేందుకు వైసిపి చేసే కుట్రలను ప్రజలు తిరస్కరిస్తారని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కాపు యువకుడు సాయి కృష్ణ లాకప్ డెత్‌ను అడ్డం పెట్టుకుని పవన్ కళ్యాణ్‌పై వైసిపి కాపు నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తిరుపతిలోని తన కార్యాలయంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి కాపు నాయకులు కోనసీమలో సమావేశమై, ఎన్డీఏ కూటమి పాలనలో కాపులకు అన్యాయం జరుగుతోందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. కాపు, బలిజలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ఆరోపించారు. కులం లేదు అని చెప్పే పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఎందుకు పోటీ చేశారు అని అడిగే అర్హత వైసిపికి లేదని, జగన్మోహన్ రెడ్డికి పులివెందుల నుంచి కాకుండా మరొక చోట పోటీ చేసే ధైర్యం ఉందా అని ఆరణి శ్రీనివాసులు సవాల్ విసిరారు. గతంలో శ్రీకాళహస్తిలో జనసేన కార్యకర్త కొట్టే సాయిని పోలీసు అధికారిణి కొడితే, పవన్ కళ్యాణ్ స్వయంగా వెళ్లి పరామర్శించి, ఎస్పీతో మాట్లాడి జనసేన శ్రేణులకు ధైర్యం కల్పించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఒక సామాన్య కార్యకర్త అయిన కొట్టే సాయికి శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ పదవి ఇచ్చిన చరిత్ర పవన్ కళ్యాణ్‌దని, కానీ జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క సామాన్య కార్యకర్తకూ పదవి ఇవ్వలేదని విమర్శించారు. ఐదేళ్ళ వైసిపి పాలనలో కాపు కార్పోరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కాపు భవనాలు, కళ్యాణ మండపాల నిర్మాణాన్ని నిలిపివేసిన ఘనత వైసిపిదేనని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కాపు విద్యార్థులకు కనీసం స్కాలర్ షిప్‌లు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. సామర్లకోటలో కాపులకి రిజర్వేషన్ ఇచ్చేది లేదు అని జగన్ రెడ్డి ప్రకటించినప్పుడు ఈ వైసిపి కాపు నేతలు ఎందుకు ప్రశ్నించ లేదని నిలదీశారు. మా ఊరికి రోడ్డు వేయండి అని అడిగిన వెంగయ్య అనే కాపు యువకుడిని ఆనాటి వైసీపీ ఎమ్మెల్యే బూతులు తిట్టడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఈ కాపు నాయకులు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు.వైసిపి పాలనలో పదవులు పొందటమే కాకుండా, దోపిడీలోనూ ఒకే కులం భాగస్వామ్యమైందని ఆయన ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి చేసిన అరాచకాలు, దోపిడిని వైసిపిలోని కాపు నాయకులే ప్రజలకు బహిరంగ పరచాలని ఆయన కోరారు. జగన్‌ను ప్రశ్నించ లేని వారికి పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ఎన్డీఏ కూటమి కాపులకు ఇచ్చిన ప్రతి హామిని నెరవేరుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కూటమి నేతలు తమ్మినేని వెంకటేశ్వర రావు,ఆర్కాట్ కృష్ణప్రసాద్, అంకాలమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ కొండా రాజ్ మోహన్, రమేష్ నాయుడు, కెఎంకె లోకేష్, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, బాబ్జీ, రాజేష్ ఆచ్చారి,జేకే రాయల్, మణి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## టీటీడీ యోగా పోటీల్లో ప్రతిభ చాటిన ఎస్వీజేసి విద్యార్థులు



తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త

టీటీడీ ఆధ్వర్యంలో పక్షం రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగా ఆరోగ్యానందం పోటీల విద్యార్థి విభాగంలో స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల (ఎస్వీజేసి) విద్యార్థులు క్లీన్‌స్వీప్ చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీల్లో కళాశాలకు చెందిన ఆర్. జ్యోతిష్ అభినయ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, డి. వెంకట హర్షిత్ ద్వితీయ, జి. అభిషేక్ తృతీయ స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఆదివారం జరిగిన ప్రధాన యోగా ఉత్సవంలో విజేతలకు టీటీడీ కార్యనిర్వహణాధికారి (ఈవో) ముద్దాడ రవిచంద్ర చేతుల మీదుగా జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు వి. ప్రసన్నలక్ష్మి ్మ, ఎన్. వరలక్ష్మి ్మ, ఎస్. విజయలక్ష్మి ్మ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, విద్యార్థులలో క్రమశిక్షణ, ఏకాగ్రత, మానసిక ప్రశాంతతను పెంపొందించి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు యోగా, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా బాధితుడి సర్టిఫికెట్లు అతనికి అప్పగించేలా కలెక్టర్ కఠిన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు ఏపీ స్టూడెంట్స్ జేఏసీ

## జూన్ 24 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



**హెల్ప్‌లైన్ సెంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేదు**

**జూన్ 24 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం**

**జూలై 6న సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదల**

తిరుపతి విద్య జూన్ 22 ప్రభాత వార్త

ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ఏపీ పాలీసెట్ –2026 ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో కీలక మార్పులు చేపట్టిందని, ఈ ఏడాది నుంచి సర్టిఫికెట్ ధ్రువీకరణను పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వై. ద్వారకానాథ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థల్లో ఒకటిగా కొనసాగుతోందని, అధికారిక వివరాలు తెలిపారు.విద్యార్థుల సౌలభ్యం, పారదర్శకత, సమయ పొదుపును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికేట్లను ఆన్లైన్‌లో అప్లోడ్ చేయడం ద్వారా ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని, హెల్ప్‌లైన్ కేంద్రాలకు ప్రత్యక్షంగా హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం జూన్ 24 నుంచి 30 వరకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ల అప్లోడ్ ప్రక్రియ కొనసాగనుంది. జూన్ 25 నుంచి జూలై 1 వరకు ఆన్లైన్ సర్టిఫికెట్ ధ్రువీకరణ నిర్వహించనున్నారు. జూన్ 29 నుంచి జూలై 3 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉండగా, జూలై 4న ఆప్షన్లలో మార్పులు చేసుకునే అవకాశం కల్పించారు. జూలై 6 సాయంత్రం 6 గంటల తర్వాత సీట్ల కేటాయింపు ఫలితాలను ప్రకటించనున్నారు. జూలై 7 నుంచి 10 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌తో పాటు సంబంధిత కళాశాలల్లో రిపోర్టింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు అవసరమైన అన్ని సర్టిఫికేట్లను స్పష్టంగా స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన తాజా సమాచారం, మార్గదర్శకాలను పాలిసెట్ అధికారిక వెబ్‌సైట్: పాలిసెట్.ఏపీ.జీవోవీ.ఇన్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు.




## కార్పొరేట్ కాలేజీల అక్రమ ఫీజుల దందా

తిరుపతి విద్య జూన్ 22 ప్రభాత వార్త

తిరుపతి జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చిన ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీల అక్రమాలపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సమరభేరి మోగించింది. విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతిలోని ప్రాంతీయ తనిఖీ అధికారి కార్యాలయాన్ని విద్యార్థులు ముట్టడించి, గేట్ల ఎదుట బైఠాయించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐఒ కార్యాలయ ఏఓ మనోరమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్. జాకీర్, కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్డూఅదుపూ లేకుండా అదనపు సెక్షన్లు నడుపుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పుస్తకాలు, యూనిఫాంలు, స్టడీ మెటీరియల్స్ నిర్దిష్ట దుకాణాల్లోనే కొనాలని బలవంత పెట్టడం దోపిడీకి పరాకాష్ట అన్నారు. ఫీజులు సకాలంలో చెల్లించలేదనే సాకుతో విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, పరీక్షలు నిరాకరించడం మరియు మానసికంగా వేధించడం లాంటి చర్యలకు పాల్పడుతున్న కాలేజీలపై విద్యాశాఖ తక్షణమే విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నడుస్తున్న ఐఐటీ జేఈఈ , నీట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు పై తీసుకోవాలని, ప్రతి కాలేజీ నోటీస్ బోర్డులో ప్రభుత్వ ఫీజుల పట్టికను ఉంచాలని కోరారు. కార్పొరేట్ రెసిడెన్షియల్ హాస్టళ్లలో కనీస వసతులు, నాణ్యమైన ఆహారం, భద్రతపై తనిఖీలు నిర్వహించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి సర్వేపల్లి నరసింహ, నాయకులు శెట్టిపల్లి సాయికుమార్, నాగరాజు, శ్రీరాములు, రవితేజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నయం చేయవచ్చు..




రేణిగుంట జూన్ 22 ప్రభాతవార్త :

ప్రారంభ దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే చికిత్స చేసి నయం చేయవచ్చని టాటా ట్రస్ట్ మేనేజర్ హేమంత్ అన్నారు. రేణిగుంట మండలం మా పంచాయతీ నందు సోమవారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మధుమేహం, రక్కపోటు, రొమ్ము నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా టాటా ట్రస్ట్ మేనేజర్ హేమంత్ మాట్లాడుతూ రాస్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ప్రజలు క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స చేసి నయం చేయవస్తున్నారు. రక్కపోటు, మధుమేహం, థైరాయిడ్ లను అదుపులో ఉంచుకోవాలన్నారు. వ్యాధులు సంక్రమించి బాధలు పడటం కంటే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ సిబ్బంది డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డి కుమారి, మెహతా, రాజ్ ప్రాజెక్టు ఆఫీసర్ రవి, రామానుజులు, స్వాతి, నాగమణి, ఉష, శంకరయ్య, రాస్ బాలాజీ బాలవికాస్ సిబ్బంది సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రయాణీకులతో మర్యాదగా మెలగాలి: ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య



తిరుపతి, జూన్ 22ప్రభాతవార్త: తిరుపతి నగరంలో ఆటో డ్రైవర్లు ప్రయాణీకులతో మర్యాదగా వ్యవహరించాలని, యూనిఫాం ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య నాయుడు ఆదేశించారు. సోమవారం ఆటో యూనియన్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పలు అంశాలు సూచించారు. ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయరాదని, నిజాయితీతో సేవలు అందించాలని, నగరంలో ట్రాఫిక్ క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆదేశించారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవనం ఆక్షేపణీయం

**-స్పెషల్ డ్రైవ్‌లో అదుపులోకి మందుబాబులు**

తిరుపతిరూరల్,జూన్ 22 ప్రభాతవార్త:

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం ఆక్షేపణీయమని ఎక్సైజ్ పోలీసులు హెచ్చరించారు. తిరుపతిరూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి.ఐ నరసానాయుడు ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నవారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, కొందర్ని అదుపులోకి తీసుకున్నారు. తిరుపతిరూరల్ సర్కిల్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న మురళి, మధులను



## డీఎస్సీ నియామక అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి: ఏఐవైఎఫ్

తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త

డీఎస్సీ 2025 నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆలిండియా యూత్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తిరుపతిలో విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీ దస్త్రంపై చేసినప్పటికీ, పది నెలలు గడిచినా ప్రక్రియ పూర్తి చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 35 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే, కేవలం 16,347 పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన పేపర్ లీకేజీ ఆరోపణలు, టెట్ మరియు డీఎస్సీ పరీక్షలు రాయకుండానే నకిలీ క్రీడా సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారనే అంశాలు నిరుద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులను తొలగించి, వారి స్థానాల్లో క్రీడా కోటా పేరుతో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం తన సూపర్6 హామీలలో భాగంగా ప్రకటించిన నిరుద్యోగ భృతిని (నెలకు రూ.3 వేల చొప్పున, రెండేళ్లకు రూ.72 వేలు) తక్షణమే నిరుద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, విక్రమ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ స్కూల్లో మిన్నంటిన యోగా డే సంబరాలు




తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాత వార్త

**ఆసనాలతో ఆకట్టుకున్న నారాయణ విద్యార్థులు**

**యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం: డిజియమ్ కొండలరావు**

స్థానిక శ్రీనివాస మంగాపురంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ పిలుపు మేరకు స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహభరిత వాతావరణంలో వివిధ రకాల యోగాసనాలను ప్రదర్శించారు. ఉదయాన్నే ప్రారంభమైన ఈ కార్యక్రమం విద్యార్థుల క్రమశిక్షణ, యోగా పటిమతో ప్రత్యేకంగా నిలిచింది. ఈ వినూత్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ విద్యాసంస్థల డి.జి.యం కొండలరావు, ఏ.జి.యం శ్రీనివాసులు విచ్చేశారు. వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో ఒత్తిడితో కూడిన జీవనశైలి వల్ల చిన్న వయసులోనే అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న కాలంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో అవసరమని, అందుకు యోగా సాధన చక్కటి ఔషధమని పేర్కొన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లభిస్తుందని, విద్యార్థులు చదువులో మరింత రాణించడానికి ఇది దోహదపడుతుందని సూచించారు. యోగా డే సందర్భంగా పాఠశాల మైదానంలో వందలాది మంది విద్యార్థులు ఒకేసారి చేసిన సూర్యనమస్కారాలు, ప్రాణాయామం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పద్మాసనం, వజ్రాసనం, తాడాసనం వంటి పలు కఠినమైన ఆసనాలను విద్యార్థులు ఎంతో సులువుగా ప్రదర్శించి చూపర్లను కట్టిపడేశారు. ఈ వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న ఆర్.ఐలు, అకడమిక్ కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్ విద్యార్థుల యోగా ప్రతిభను ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి ఆశీర్వచనాలందించారు. ప్రతిరోజూ పాఠశాలలో యోగాకు కొంత సమయం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం దౌర్జన్యం

**ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డ బాధితుడు**




**కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ ధ్వజం! యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి..**

తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త

గత ప్రభుత్వం చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వివాదం చివరకు పేద విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. గొల్లపల్లిలోని సిద్ధార్థ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల యాజమాన్యం సాగిస్తున్న దౌర్జన్యాలపై సోమవారం తిరుపతి కలెక్టరేట్ సాక్షి గా ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నిప్పులు చెరిగింది. జేఏసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్ నేతృత్వంలో బాధిత విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఒక ఘాటైన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. సిద్ధార్థ కాలేజీలో ఎం.పెడ్ పూర్తి చేసిన గాలిమూరి మధు అనే పేద విద్యార్థి జీవితాన్ని సదరు యాజమాన్యం ఐదేళ్లుగా ఎలా రోడ్డున పడేసిందో వివరించారు. 2019 నుండి 2024 వరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడానికి, విద్యార్థికి ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ.. కేవలం ఫీజు బకాయిల నెపంతో ఆ విద్యార్థికి సంబంధించిన టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి.పెడ్, ఎం.పెడ్ ఒరిజినల్ సర్టిఫికెట్లన్నింటినీ కాలేజీ యాజమాన్యం అక్రమంగా నొల్లేసిందని ధ్వజమెత్తారు. సర్టిఫికెట్లు చేతిలో లేక, వచ్చిన ఉద్యోగ అవకాశాలను కోల్పోతూ ఐదేళ్లుగా ఆ యువకుడు మానసిక క్షోభ అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఫీజులు రాకపోతే యాజమాన్యాలు అధికారులతో తేల్చుకోవాలే తప్ప, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను బందీగా ఉంచే హక్కు ఏ చట్టం ఇచ్చిందని శ్రీధర్ నిలదీశారు. విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న సిద్ధార్థ కళాశాల యాజమాన్యంపై తక్షణమే విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు

# 10,700 కోట్ల ఫీజుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి: ఏ ఐ ఎస్ ఎఫ్




తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.10,700 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా గత ప్రభుత్వ కాలం నాటి బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటనలు చేస్తున్నారే తప్ప, అవి విద్యార్థుల ఖాతాల్లో జమ కాకుండా కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గత, ప్రస్తుత విద్యా సంవత్సరాలకి కలిపి మొత్తం 9 క్వార్టర్స్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ.6,300 కోట్లు, గత రెండేళ్ల నుండి రూ.2,200 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ప్రతి ఏటా ఫీజుల పథకానికి రూ.3,900 కోట్లు కేటాయించాల్సి ఉండగా, 202627 బడ్జెట్‌లో కేవలం రూ.2,766 కోట్లు మాత్రమే కేటాయించి 11 లక్షల మంది ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజుల బకాయిలతో సంబంధం లేకుండా కాలేజీ యాజమాన్యాలు తక్షణమే ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న అమ్మఒడి, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తిరుపతి నగర కార్యదర్శి వినయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఓం రాజ్, నగర నాయకులు చరణ్, యుగేష్, యశ్వంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## దుర్వాసన వస్తున్నా... స్పందించని వైద్యాధికారులు

- పంచాయతీ కార్యదర్శి విధుల్లో ఉన్నారా?



పూతలపట్టు, జూన్ 22 ప్రభాతవార్త: మండలంలోని పూతలపట్టు ప్రాథమిక కేంద్రం ముందర చెత్త వేయడం కోసం పంచాయతీ అధికారులు సీసీ రోడ్డుపై సిమెంటు వరలు ఉంచారు. అయితే పంచాయతీ కార్యదర్శి, పంచాయితీలో చెత్తను తీసే సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా, విధుల్లో ఉంటే చెత్త నిండుతున్న ఎందుకు తీయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందర చెత్త చెత్త వేయడానికి సిమెంటు వరలు ఉంచారు. చెత్త నుండి దుర్వాసన వెదజల్లుతుంది కుళ్లిపోయిన మామిడి పండ్లు ద్వారా ఈగలు దోమలు అధికమై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు మరిన్ని వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయని రోగులు ప్రభుత్వ ఆసుపత్రి చికిత్స చేయించుకోవడానికి ఎక్కువ మక్కువ చూపడం లేదని రోగులు, ప్రైవేటు హాస్పటల్ చికిత్స చేయించుకోవాల్సి వస్తుందని స్థానికులు తెలుపుతున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, శుభ్రం చేసుకోవడం, పంచాయతీ సిబ్బంది చేత శుభ్రం చేపించుకోవడం కూడా లేదని స్థానికులు తెలుపుతున్నారు వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా స్పందించి పంచాయతీ అధికారులు, వైద్య అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిది

-ఎమ్మెల్యే శ్రీధర్, టిడిపి నాయకురాలు ముక్కా వరలక్ష్మమ్మ



పెనగలూరు, జూన్ 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో నేడు ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మమ్మ తెలిపారు. సోమవారం పెనగలూరు మండలంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణి చేశారు. నారాయణ నెల్లూరు కు చెందిన రామిరెడ్డిగారి కృష్ణ ప్రియ రూ. రూ.40,786, నల్లపురెడ్డిపల్లికి చెందిన స్వర్ణలతకు రూ.రూ.50,348, నల్లపురెడ్డిపల్లి దళితవాడకు చెందిన ఒప్పత్తూరు బెనికి రూ.77,900, ఓబిలికి చెందిన కాలి రాజేంద్ర ప్రసాద్‌కు రూ.53,734 ఓబిలి అత్తిగారిపల్లికి చెందిన కట్టా పద్మావతికి రూ.37,873 కొత్త సింగనమలకు చెందిన గుండ్లూరు లక్ష్మీనరసింహకు రూ.43,759 శింగారెడ్డిపల్లికి చెందిన మంజుల రత్నమ్మకు రూ.25,400 కొత్తసింగనమలకు చెందిన శ్రీలక్ష్మి కి రూ.1,32,466 పెనగలూరుకు చెందిన విజయమ్మకు రూ. 40 వేలు, బంట్రోతు బుజ్జమ్మకు రూ.40 వేలు, పసుపులేటి యంగయ్యకు రూ.68,862 ఓబిలి వెంకట సుబ్బయ్య కు రూ.54,595, మూగవారిపల్లికి చెందిన బత్తిన వెంకటరెడ్డికి రూ. 66,6695 కట్టావారిపల్లికి చెందిన గంప అంజలీ రూ. 24,010 వెలగచర్ల కు చెందిన నాగరత్నమ్మకు 1,42,290 పండుగోలు రెడ్డయ్యకు రూ. 50,786 విఎం పురానికి చెందిన సానేపల్లి సుబ్బరామయ్యకు రూ. 40,350 మలిశెట్టి వెంకట నాగమ్మకు రూ. 20 వేలు, ఉప్పరపల్లికి చెందిన నూకరెడ్డి మోనికకు రూ.74,785లకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ నరసింహరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి కొత్త బాలకృష్ణ, లేబాక శ్రీనివాసులు రెడ్డి, దాసరి దామోదర్, చక్రంపేట సురేష్ రెడ్డి, నరేష్,మాడ పూరి శ్రీనివాసులు, అమీరుల్లా, కొత్తపల్లి కళా చంద్ర, గోబ్బురి హరి, పాల్‌రెడ్డి, రెడ్డయ్య రెడ్డి, రెడ్డివారిపల్లి హరి, మద్దెల ప్రసాద్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగ శ్రీ మల్లికార్జున స్వామి వార్షికోత్సవ వేడుకలు



పెనగలూరు, జూన్ 22 ప్రభాతవార్త: రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం కాకర్లవారిపల్లి వడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మహోత్సవాల్లో రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మమ్మ పాల్గొని ప్రత్యేక పూజల చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను, ముక్కా వర లక్ష్మమ్మ, దాసరి దామోదర్ నాయుడు ను గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కే ఎన్ ఆర్, చక్రంపేట సురేష్ రెడ్డి, కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పారదర్శక పాలనపై ఆత్మీయ సమావేశం





తిరుపతిరూరల్,జూన్ 22 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా రెండెళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం చంద్రగిరి పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పులివర్తి నాని అధ్యక్షత వహించగా, భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 25 నుండి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశయాలే లక్ష్యమని...చంద్రగిరి అభివృద్దే ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాభితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దొంగ ఓట్లు, నకిలీ నమోదులపై కఠినంగా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పారదర్శక ఓటర్ల జాబితా కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని సూచించారు.గత రెండేళ్లలో రహదారులు, తాగునీరు, విద్య. వైద్యం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వం విశేషంగా పని చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివయ్య హుండీల భద్రత ఎంత?

-లెక్కింపుల్లోనూ...కొందరి చేతి వాటం -హుండీలు నిండినా లెక్కింపు జాప్యమేలా!

-కొరవడిన ఇ.ఓ, డిప్యూటీ ఇఓల పర్యవేక్షణ

-మద్యం మత్తులో ఆలయ ప్రవేశం చేసినా పట్టించుకోని సెక్యూరిటీ




శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో హుండీల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆలయంలోని కంచుగడప దాటితే ప్రతి పరివార దేవత ఆలయం వద్ద హుండీలను ఏర్పాటు చేసారు. అలాగే అర్చకుల తట్టలు దర్శనమిస్తాయి. ఆకాశ వినాయకుడు, చెంగల్వరాయస్వామి, వెంకటేశ్వరస్వామి, స్వామి గర్భగుడి, శనీశ్వం స్వామి, బెజవాడ కనకదుర్గమ్మ, నటరాజస్వామి, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు గురుదక్షిణామూర్తి ఆలయాల వద్ద హుండీలు దర్శనమిస్తున్నాయి. భక్తులు తమకు తోచిన రీతిలో హుండీల్లో కానుకలు సమర్పిస్తుంటారు. అయితే స్వామి వారి గుర్భగుడి వద్ద నాలుగు హుండీలను ఏర్పాటు చేసారు. ఇక్కడ భక్తులు కానుకలతో పాటు రాహుకేతు దోష నివారణ చేయించుకున్న అన్ని రకాల టిక్కెట్లు భక్తులు ఇక్కడ వెండి నాగ పడగలను హుండీల్లో సమర్పిస్తారు. దేవాదాయశాఖ స్పష్టంగా 15రోజుల కొకమారు హుండీలను లెక్కించుటకు ఆదేశించి ఉంది. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏం జరుగు తుంది? ఎందుకి ఇలా జరుగుతుంది? అధికారుల నిర్లక్ష్యమా? లేక దేవాదాయశాఖ ఆదేశాలు బేఖాతరా?హుండీలు నిండినా ఎందుకు లెక్కింపు జరగటం లేదు? అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో హుండీలను గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా నిర్వహించే వారు. దానిని ప్రస్తుతం మందుకొట్టు మండపం వద్దకు మార్చారు. హుండీల్లోని మొత్తాలను గన్ని బ్యాగుల్లో కుమ్మరించుకొని మోసుకొని మందుకొట్టు మండపం వద్దకు చేర్చాలి? మధ్యలో ఏమైనా జరిగే అవకాశం ఉంది కదా? మరి ఈ నిర్ణయం గత అధికారులు తీసుకున్నారు. మరి క్షేత్రస్థాయి లో సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రస్తుత అధికారులు ఎందుకు నిర్ణయం తీసుకోకూడదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

**హుండీలు నిండినా ఎందుకు జాప్యం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి గర్భగుడి వద్ద నాలుగు హుండీలు ఏర్పాటు చేసారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హుండీలు నిండాయి, వాటిని సీల్ చేసారు. ఒకే హుండీ సుమారు ఏడు అడుగుల హుండీని ఏర్పాటు చేసారు. అందులోంచి రాజమండ్రికి చెందిన యువకుడు తప్పతాగి చేయి వేసి దొంగతనానికి పాల్పడ్డాడు. పోలీసుల ఆతను తస్కరించిన సొమ్ములను లెక్కించగా రూ.25,170లు ఉన్నట్లు గుర్తించారు. అయితే హుండీలు లెక్కించటంలో జాప్యం ఎందుకు? ఇక్కడ హుండీలకు సంబంధించి లెక్కింపుల్లో వివాదాలు విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఇఓ కార్యాలయంతో పాటు ఆలయ పాలనా చూసుకుంటారు, మరి డిప్యూటీ ఇఓ ఏమి చేస్తున్నట్లు, త్వరలో పదవీ విరమణ పొందే అవకాశం వున్నందున్న, ఆయన ఫైనాన్స్ ఫైల్స్‌తో, ఇఓకు సంధాన కర్తగా వ్యవహరిస్తూ, ఆలయ పాలన పట్టించుకున్న సందర్భాలు లేవు. దిగువ స్థాయి ఉద్యోగులపై ఆధారపడడంతో,. డిప్యూటీ ఇఓ ఆలయ పాలనలో బాధ్యత కొరవడినట్లు స్పష్టంగా తెలుస్తుంది. అయితే హుండీలను దేవాదాయశాఖ ఆదేశాల మేరకు 15రోజులకొక మారు లెక్కిస్తే వివాదాలు ఉండవు కదా? ఇక లెక్కింపు సందర్భంగా కూడా చాలా సార్లు సొమ్ములు వేలలో తస్కరించినట్లు విమర్శలున్నాయి. అయితే ఈ ఆలయంలో దొరికితే దొంగలు లేకుంటే దొరల్లా వ్యవహరిస్తున్నారు. అయితే ఒక తప్పు చేసిన వారికి శిక్షపడితే మరో సారి చేయరు? అయితే ధార్మిక కేంద్రం కదా? ఎవరో ఒక నాయకుని సిఫార్సులతో వదలి పెట్టడంతో తప్పులు చేసిన వారే మళ్ళీ తప్పులు చేస్తున్నారు.

## వాయులింగేశ్వరుని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్



శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన వాయులింగేశ్వరుని సేవలో సోమవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ దంపతులతో పాటు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు ఆలయ ఇఓ బికె వెంకటేశు, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి స్వాగతం ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు,ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. గవర్నర్ దంపతులతో పాటు లైజనింగ్ అధికారి విజయ్‌భరత్‌రెడ్డి ఉన్నారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎఇఓ లోకేష్‌బాబు,ఎపిఆర్‌ఓ రవిలు పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్ పెక్టర్ హరియాదవ్, శ్రీకాళహస్తి తహశీల్దార్ టివి సుబ్రమణ్యంలు స్వాగతం ఏర్పాట్లు చేసారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఇఓ బికె వెంకటేశు,ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టిలు అందించారు.

## శివయ్య సేవలో క్రికెట్ కోచ్ పూజలు



శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం ప్రముఖ క్రికెట్ కోచ్ వారి సహాచరులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద స్వాగతం ఏర్పాటు చేసారు. టీం ఇండియా ట్రైనింగ్ అసిస్టెంట్ రాఘవేంద్ర డివీజి (రఘు) టీం ఇండియా ఫిజియో ధెరపిస్టు యోగేష్ పర్మార్‌లు రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. కాగా ఐఏయస్ అధికారి డాక్టర్ అపూర్వబసు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్, ఆలయ ఇన్స్ పెక్టర్ హరియాదవ్,ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.

## పుల్లూరుకు నివాళులు



శ్రీకాళహస్తిరూరల్,జూన్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం వాగివేడు గ్రామంలో తెలుగుదేశం నాయకులు పుల్లూరు రామ చంద్రారెడ్డి హఠాన్మరణం చెందారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి అత్యంత సన్నిహితుడుగా ఆయన తనయుడు పుల్లూరు బాలాజిరెడ్డి పని చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ మాజీ మంత్రి సతీమణి బొజ్జల బృందమ్మ హాజరై కుటుంబాన్ని పరామర్శి ంచారు. ఆమెతో పాటు తాటిపర్తి ర వీంద్రరెడ్డి, పుల్లూరు కృష్ణారెడ్డి, తాటిపర్తి వేమారెడ్డిలున్నారు.

## యానాది సంఘ నాయకునిపై దారుణం!



శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త: యానాది సంఘ రాష్ట్ర నాయకుడు చందమామల కోట య్యపై గుర్తుతెలియని కారు ఢీకొట్టి పారిపో యిందని పోలీసులు ఈ సంఘటనకు సంబం ధించి స్పందించాలని సిపిఐ, ఎఐఎస్ఎఫ్ సోమ వారం డిమాండ్ చేసారు. ఆదివారం సాయ ంత్రం సమయంలో చందమామల కోటయ్య తన వాహనంపై వెళుతుండగా ఓ గుర్తు తెలియని కారు ఢీకొట్టి పారిపోయిందని వారు వివరించారు. ఈ ప్రమాదంలో గాయపడిన కోటయ్యను స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోమవారం కమ్యూనిస్టు నాయకులు ఆయన్ను పరామర్శించారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తున్న ఓ గిరిజన నాయకునిపై హిట్ అండ్ రన్ దారుణం అన్నారు. ఢీకొట్టిన కారు నడుపుతున్న వారు కనీసం మానవతా దృక్పథంతో అయినా నిలబడక పారిపోవటం అమానుషం అన్నారు. సిసి ఫుటేజీల సహాయంతో చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆత్మీయ సమావేశాలు కావు... ఆత్మావనలోక సమావేశాలు



శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త: అధికారం పోయాకే వైపాకాకు ఆత్మీయత సమావేశాలు గుర్తుకొచ్చాయా? అని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లాకార్యదర్శి అంజూరు చక్రధర్ ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి నిర్వహిస్తున్నవి కాపు ఆత్మీయ సమావేశాలు కాదని రాజీకియ భవిష్యత్తుపై భయంతో చేసుకకుంటున్న ఆత్మావలోకన సమావేశాలని ధ్వజమెత్తారు. ఐదేళ్ళ వైకాపా పాలనలో కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి,విదేశీ విద్య పథకాలను నిలిపివేసి కాపు యువత భవిష్యత్తుతో చెలగాట మాడిన నాయకులకు నేడు కాపు సమాజం గురించి మాట్లాడే నైతిక హక్కులేదని చక్రధర్ శివమెత్తారు. ప్రజలు బ్రహ్మరథం పట్టి పిఠాపురం నుంచి పవన్‌కళ్యాణ్‌ను గెలిపిస్తే నేడు వైకాపా నాయకులు మాట్లాడుతున్న మాటలు వారిలో నిరాశకు నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో ఎవరితో నడవాలో కాపు యువతకు స్పష్టత ఉందని మీరు తప్పుదారి పట్టిస్తే దారి తప్పరని గుర్తించుకోవాలన్నారు.

## నిర్ణీత ధరకే ఎరువులు అమ్మకం చేయాలి



తొట్టంబేడు, జూన్ 22 ప్రభాతవార్త: నిర్ణీత ధరకే ఎరువులను అమ్మాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం బసవ య్యపాలెం చెక్ పోస్టు వద్ద ఉన్న ఓ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల ధరల పట్టిక లేకపోవడంపై అసం తృప్తిని వ్యక్తం చేశారు. అదేవిధంగా నాగరాజు అనే రైతు వద్ద 5 డీఏపీ బ్యాగులకు రూ.3500 అదనంగా వసూలు చేయడంపై డీలరును గట్టిగా నిలదీశారు. సదరు డీలరు నుంచి అదనంగా తీసుకున్న సొమ్మును రైతుకు తిరిగి ఇప్పించారు. అదేవిధంగా ఆ దుకాణంలో అధిక ధరలకు ఎరువులు కొన్న ప్రతి రైతుకు అదనపు సొమ్మును తిరిగి ఇచ్చేస్తామని డీలర్ హామీ ఇచ్చారు. అనంతరం పుల్లయ్య మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులను అధిక ధరల మాటున దగా చేయడం తగదన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే డీలర్లు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి డీలర్ షాపు వద్ద ధరల పట్టిక ఉండాల్సిందేనని డిమాండ్ . లేకుంటే రైతుల పక్షాన ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు పెనగడం గురవయ్య, చుట్టు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కొరడా ఝుళిపించినా...

## ఆగని ఇసుక అక్రమ రవాణా అక్రమార్కులు



తొట్టంబేడు, జూన్ 22 ప్రభాతవార్త: పెన్నలపాడు గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు మరోసారి దృష్టి సారించారు.గత వారం రోజుల క్రితం పూడి, విరుపాక్షిపురం, పెన్నలపాడు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళి పించారు. ఇసుక తరలింపును అరికట్టేందుకు తహసీల్దార్ భారతి,అధికారులు ట్రెంచ్ కట్టు కూడా కొట్టించారు. అయితే అక్రమార్కులు ఆ కాలవ/ట్రెంచ్‌ను తిరిగి పూడ్చివేసి పెన్నలపాడు నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారని తహసీల్దార్ భారతి కి విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే స్పందించిన తహసీల్దార్ భారతి రెవెన్యూ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. పెన్నలపాడు తలారి శివ రెవెన్యూ సిబ్బందితో కలిసి పూడ్చివేసిన కాలువ,ట్రెంచ్ వద్దకు చేరుకుని, తిరిగి ట్రెంచ్ కట్టు కొట్టే పనులను చేపట్టారు.ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు. గ్రామస్తులు ఇలాంటి అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

## భక్తుల పై దాడి!

శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.సోమవారం మూడవ గేటు జలవినాయక ఆలయం వద్ద కొందరుభక్తులపై సంబంధం లేని గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి హంగామా సృష్టించారు.ఇదేమి పుణ్యక్షేత్రం అని ఆవేశం వ్యక్తం చేసారు.దూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులను టార్గెట్ చేసుకొని కొందరు ఆకతాయిలు దాడులు చేస్తున్నారు. సోమవారం కూడా కొందరు ఆకతాయిలు మతి స్థిమితం లేకుండా వ్యవహారిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు.

## ఇసుక మాఫియాపై క్రిమినల్ కేసులు పెట్టండి: సిపిఐ




తొట్టంబేడు, జూన్ 22 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో ఇసుక మాఫియా పై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డికి సిపిఐ పార్టీ సోమవారం వినతి అందజేశారు. శ్రీకాళహస్తి నియోజక వర్గం తొట్టంబేడు మండలంలో పట్టపగులే యథేచ్ఛగా, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని స్థానిక ఆర్డిఓకి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ స్వర్ణ ముఖి నదిలో ఇసుక ఎత్తివేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితి ఉందన్నారు ఇంత ఇసుక దోపిడీ జరుగుతు న్నప్పటికీ రెవెన్యూ అధికారులు గానీ, పోలీస్ అధికారులు గానీ ఇసకాసురుల పై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు ప్రజలకు సుపరి పాలన అందిస్తున్నా మంటున్న కూటమి ప్రభుత్వం లో ఉంటున్న నాయకులకు ఈ ఇసుక దోపిడి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్డీవో స్పందించి ఈ ఇసుక మాఫియాను అరికట్టి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మునిచెందు, హరికృష్ణలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డైరీలు పంపిణి



తొట్టంబేడు, జూన్ 22 ప్రభాతవార్త: తొట్టంబేడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు డైరీలు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాఖమూరి కిరణ్ డైరీలను అందించారు. విద్యార్థులకు జీవితంలో 10వ తరగతి అనేది ఒక మైలురాయి అని అక్కడ విజయం సాధించిన వారు ఎంతో ఉన్నత స్థితికి ఎదగగలరని తెలియజేశారు. శాఖమూరి కిరణ్ చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు డైరీలు, ఇతర విద్యాసామగ్రిని వితరణగా అందించడం జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయుడైన అక్కుర్తి ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ మీకు ఇవ్వబడిన డైరీలలోని మొదటి పేజీలలో ఇవ్వబడిన సూచనలను ప్రతిరోజు చదువుకొని పాటించిన యెడల ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ బాబు, ఉపాధ్యాయులు కుమార్, జయకుమార్, ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులే ధ్యేయంగా ఎంపీ పయనం



బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 22 ప్రభాతవార్త తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి జన్మదిన వేడుకలు అత్యంత. వైభవంగా పండుగలా మండల పార్టీ అధ్యక్షుడు కె. మణినాయుడు, వేలూరి రాకేష్ శారథ్య ంలో వైభవంగా నిర్వహించడం జరిగింది. రాజ్యసభలో అభివృద్ధి పనులపై నిరంతరం పోరాటం చేస్తూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను సాధించిన ఘనత ఎంపీ గురు మూర్తి దక్కిందన్నారు. ఎంపి గురుమూర్తి జన్మదిన. పురస్కరించు కొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేస్తూ పూల మాలలు వేసి, మహిళలకు చీరలు పంపిణీ చేసి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల వైఎస్‌ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు కె మణి నాయుడు, ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వేలూరు రాకేష్,రాష్ట్ర సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం,జిల్లా క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబు రెడ్డి,మాజీ సర్పంచ్ గురవయ్య,వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ పాల్ సిద్దేశ్వర్, ఆనంద్ కారని రమణయ్య, వెంకటేష్,కత్తి శివ,పరదామయ్య, చంద్ర, చిరంజీవి,కారని సురేష్, పెంచలయ్య, ప్రసాద్, వెంకటేష్ మహిళాలు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.